నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: కుందన్‌బాగ్, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉమానగర్, వైట్‌హౌస్, కుందన్‌బాగ్ బస్తీ, ట్రాన్సిస్ట్ హాస్టల్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐసీఐసీఐ బ్యాంక్ లేన్, భగవంతాపూర్, గగన్‌విహార్ కాలనీ, షేర్‌ఖాన్‌బస్తీ, రిలయన్స్ బిల్డింగ్, స్టార్ బక్స్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ రాంసీర్ కేఫ్, టాగూర్ హోమ్స్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సికింద్రాబాద్ ఏడీఈ మురళీ కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాంసీర్ కేఫ్, మజీద్ రోడ్, గీతారెడ్డి నర్సింగ్ హోమ్, అదేవిధంగా మధ్యాహ్నం 2. 30 గంటల నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు టాగూర్ హోమ్స్, ఈస్ట్ నేహ్రూనగర్, అడ్డగుట్ట పెట్రోల్ పంప్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ అధ్యక్షుడి మొదటి పర్యటన



స్థానిక నేతలతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు

లాలాపేట: భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే బలం అని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు అన్నారు. ఇటీవల నూతనంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా తన సొంత మున్సిపల్ డివిజన్ తార్నాక పరిధిలోని లాలాపేటలో ఆదివారం పర్యటించారు. బూత్ 97 అధ్యక్షుడి అమర్‌కుమార్ ఇంటికి వెళ్లి వారితో చాయ్ తాగుతూ కుటుంబ సభ్యులతో కొంతసేపు ముచ్చటించారు. అనంతరం లాలాపేటలో నిర్వహించిన డా. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమంలో పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిట లాడాయి. ఆదివారం గర్భగుడిలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూల విరాట్‌ను గాజులు, వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు అనిల్ తెలిపారు.

సోమవారం ఎల్లమ్మ హుండీల లెక్కింపు: ఎల్లమ్మ కళ్యాణం అనంతరం ఆలయ హుండీలను సోమవారం ఉదయం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి తెలిపారు. దేవాదయ శాఖ, భక్తుల సమక్షంలో అన్ని హుండీలను లెక్కిస్తారని తెలిపారు.

సమాజ సేవలో ఆర్యవైశ్యులు ముందుంటారు

రాంగోపాల్‌పేట్: సమాజ సేవలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారని ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పీజీ రోడ్‌లోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం హాలులో సంఘం స్వర్ణోత్సవాల సందర్భంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నిరుపేదలైన 50 మంది విద్యార్థులకు రూ.20లక్షల విలువైన నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంఘం మూడు తరాలుగా సామాజిక సేవను కొనసాగిస్తున్నారని అభినందించారు. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్ పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న దృశ్యం

పలువురి బాల కార్మికులకు విముక్తి..
యాజమాన్యాలపై కేసులు నమోదు..

నలిగిపోతున్న బాల్యం

ఆపరేషన్ ముస్కాన్‌తో వెలుగులోకి..

సనత్‌నగర్: వెట్టిచాకిరీలో బాల్యం మగ్గిపోతోంది. అడపదడపా జరుగుతున్న తనిఖీల్లో బాల కార్మికులతో పనులు చేయిస్తున్న సంఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఒకవైపు బడిబాట పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలంటూ ఏటేటా ప్రచారం చేస్తోన్నా మరోవైపు బాల కార్మికులు వెట్టి చాకిరీలో నలిగిపోతూ పట్టుబడడం కలవరానికి గురిచేస్తోంది. తాజాగా సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన 'ఆపరేషన్ ముస్కాన్'లో వివిధ కంపెనీల్లో వెట్టి చాకిరీ చేస్తున్న పలువురు బాల కార్మికులను విముక్తి కలిగించారు. అంతేకాదు..వారితో పనులు చేయిస్తున్న యాజమాన్యాలపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు కూడా నమోదు చేయించారు.



నాలుగు రోజులుగా వెలుగు చూసిన ఘటనలు..

- బాల కార్మికులను గుర్తించడం కోసం ఆపరేషన్ ముస్కాన్ బృందం నాలుగు రోజులుగా ఫతేనగర్ ప్రాంతంలో పర్యటించిన సమయంలో ఆయా కంపెనీల్లో పనిచేస్తున్న బాలురను గుర్తించింది.
- ట్రిక్ క్లీన్ ఎంటర్‌ప్రైజెస్‌లో చేస్తున్న బాలుడు (17) బాత్‌రూం క్లీనింగ్ లిక్విడ్ తయారుచేస్తుండడంతో ముస్కాన్ బృందం ప్రతినిధులు కంపెనీ యజమాని నర్సింహపటేల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- అలాగే ఎస్పీ ఇంజనీరింగ్స్‌లో పనిచేస్తున్న బాలుడు (17)కి విముక్తి కలిగించి యజమాని మహ్మద్ అబ్దుల్ గఫార్‌పై ఫిర్యాదు ఫిర్యాదు చేశారు.
- అగ్రం పవర్ సిస్టంలో వెల్డింగ్ పనులు చేస్తున్న బాలుడు (17)ను గుర్తించి యజమాని గఫ్ఫార్‌పై ఫిర్యాదు చేశారు.
- వీణ ఇండస్ట్రీస్‌లో ఫ్యాన్ల తయారీ కర్మాగారంలో పనిచేస్తున్న బాలుడు (15)ను గుర్తించి యజమాని భూషణ్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముస్కాన్ బృంద సభ్యుడైన ఆశ్రిత ఎన్‌జీఓ సంస్థ ప్రతినిధి ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బయటపడనివారు ఇంకెంతమందో..!

గడిచిన రెండు మూడు రోజుల్లోనే నలుగురు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కలిగించారంటే ఆపరేషన్ ముస్కాన్‌ను నిరంతరాయంగా అమలుచేస్తే మరింత మంది బాల కార్మికులను గుర్తించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చట్టాలు ఎంత కఠినంగా చేసినా ఏమాత్రం భయం లేకుండా కొందరు పిల్లలతో యథేచ్ఛగా పనులు చేయిస్తూ అధికారులకు సవాల్ విసురుతూనే ఉన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఉన్నత భవిష్యత్తు గురించి ఆలోచన చేయాలే తప్ప బాల కార్మికులుగా మార్చవద్దని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇదే క్రమంలో బాల కార్మిక చట్టంపై విస్తృత అవగాహన కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అటు బాలలను పనుల్లో పెట్టుకునే సంస్థల యాజమాన్యాలతో పాటు ఇటు తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించడం ద్వారానే వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దినవారవుతారని అభిప్రాయపడతున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



బన్సీలాల్‌పేట్ ప్రాంతంలో పీరీలను సందర్శించిన కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం మొహర్రం వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాలు సందడిగా కనిపించాయి. ఆయా ప్రాంతాల్లో పీర్లను ఉరేగించారు. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, మోండా మార్కెట్, పాట్‌మార్కెట్, రాణిగంజ్, బండమైసమ్మనగర్, ముస్లీం బస్తీ, బోలక్‌పూర్ తదితర ప్రాంతాల్లో మొహర్రం నిర్వహించారు. పెద్ద ఎత్తున ముస్లీంలు బ్యాండ్ మేళాలతో పీరీలను వివిధ ప్రాంతాల్లో ఉరేగించారు. సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి పీరీలను ఉరేగింపుగా తీసుకెళ్లి సికింద్రాబాద్ కర్బలామైదాన్ సమీపంలో నిమజ్జనం చేశారు. మొహర్రం సందర్భంగా పీరీల ఉరేగింపులతో రాణిగంజ్, కర్బలామైదాన్ చౌరస్తాలు ఉరేగింపులతో కోలాహలంగా కనిపించాయి.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.31, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 37, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 17, క్యారెట్ 40, దొండ 37, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 25, మొరంగడ్డ 25, కందగడ్డ 55, సొరకాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

చిలకలగూడ: ముస్లిం సోదరులకు పవిత్ర పర్వదినమైన మొహర్రంను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిలకలగూడకు చెందిన హఫీజ్, హనీ మున్నీషా వంశస్థుల నేతృత్వంలో చిలకలగూడ గాంధీ చౌక్‌వద్ద ఏర్పాటు చేసిన పీర్లను డప్పుల దరువులతో పురవీధులలో ఊరేగించారు. ఆదివారం సాయంత్రం పీర్లను చిలకలగూడ, కిందిబస్తీ, నామాల గుండు, వెంకటేశ్వరనగర్, అన్నానగర్, శ్రీనివాసనగర్, మసీదుగల్లీ తదితర ప్రాంతాలలో ఊరేగించి కర్బలా మైదానంలో నిమజ్జనం చేశారు.



అంబర్‌నగర్ చిల్లా వద్ద షర్బత్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

పద్మారావునగర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. ఆదివారం ఆదయ్యనగర్‌లోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, నాగులు, తలసాని ధరం యాదవ్, సైకిలాబ్ యాదవ్, రాములు, జయరాజ్, మహేందర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభినవనగర్ కాలనీ అభివృద్ధికి చర్యలు



అభినవనగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ అభినవనగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఆదివారం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, కాలనీ అధ్యక్షులు దేశ్‌పాండే, రాజేష్ గౌడ్, పవన్‌కుమార్ గౌడ్‌లతో కలిసి అభినవనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సనత్‌నగర్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, జలమండలి డీజీఎం క్రిష్ణలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేషన్ రాజు, ఏసూరి మహేష్, మహేందర్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్, శ్రీనివాస్, వెంకట్ ముదిరాజ్, గజ్జెల శ్రీనివాస్, అనితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో జునోసిస్ డే



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బోయిగూడలోని పశువైద్యశాలలో ఆదివారం ప్రపంచ జునోసిస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ వాక్సిన్‌ను ఉచితంగా ఇచ్చారు. పశువైద్యశాల ప్రొఫెసర్ ఎస్. అయోధ్య మాట్లాడుతూ మనుషుల నుంచి జంతువులకు, జంతువులను మనుషులకు సంక్రమించే వ్యాధులను జునోసిస్ వ్యాధులు అంటారని చెప్పారు. జంతువులతో సన్నిహితంగా మెలిగేవారు వెటర్నరీ సిబ్బంది, డెయిరీ ఫామ్ సిబ్బంది రేబిస్ టీకాలు వేయించుకోవాలని సూచించారు.

హరితహారానికి పది సంవత్సరాలు

చిలకలగూడ: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం నేటికి పది వసంతాలు పూర్తి చేసుకుందని హరితసేన రాష్ట్ర కోఆర్డినేటర్ గర్రెపల్లి సతీష్, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమలు అన్నారు. ఈసందర్భంగా నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను హరితసేన కొనసాగిస్తుందన్నారు.



ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న హరితసేన ప్రతినిధులు

కానిస్టేబుళ్లను పరామర్శించిన బేగంపేట ఏసీపీ



గాయపడిన కానిస్టేబుళ్లను పరామర్శిస్తున్న బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి

సనత్‌నగర్: పోలీసులను చూసి తప్పించుకుపోయే క్రమంలో కారును వేగంగా నడిపి కానిస్టేబుళ్లను ఢీకొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయడిన కానిస్టేబుళ్లను బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి ఆదివారం పరామర్శించారు. బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి గస్తీ విధులు నిర్వహిస్తున్న చంటి, ప్రవీణ్ అనే కానిస్టేబుళ్లకు డైరీఫాం సమీపంలో అనుమానాస్పదంగా ఓ కారును వారు ఆపేందుకు ప్రయత్నించారు. కారు డ్రైవర్ కానిస్టేబుళ్లను తప్పించుకునే ప్రయత్నంలో కారుతో వారిని ఢీకొట్టి పరారయ్యాడు. సంఘటనలో కానిస్టేబుల్ ప్రవీణ్‌కు కాలు విరిగింది. చంటికి స్వల్పంగా గాయాలయ్యాయి. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌ను ఏసీపీ పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారిని ఢీకొని పారిపోయిన కారును పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించామని ఏసీపీ తెలిపారు.

షర్బత్ పంపిణీ



రసూల్‌పురా: మొహర్రం సందర్భంగా ఆదివారం అంబేద్కర్‌నగర్‌లో షర్బత్ పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పీసీసీ కార్యదర్శి రాజేష్‌యాదవ్, మహ్మద్ అస్లాం, అక్బర్, రఫీక్, చాంద్, ఇటుక గోపి, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద ఆధ్యాత్మిక సందడి



శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసీదళార్చన



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ

చిలకలగూడ: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిలకలగూడలోని పలు ఆలయాల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పుష్పాలు, విద్యుత్ దీపాలతో ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయ ఛైర్మన్ నోముల ప్రకాశరావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. శ్రీనివాసనగర్ శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసీదళార్చన, వేదపారాయణం నిర్వహించారు. ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, కమిటీ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్‌లు నేతృత్వంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టారు. నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయంలో ఛైర్మన్ చందర్, ఈఓ శ్రీనివాసరావుల నేతృత్వంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామని చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్ తెలిపారు.

అడ్డగుట్ట: తొలి ఏకాదశి సందర్భంగా తుకారాంగేట్ పహాడీ హనుమాన్ ఆలయంలోని పాండురంగ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే పాండురంగ స్వామి వార్ల విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేశారు.



శాకాంబరి అలంకారంలో శ్రీపోచమ్మ అమ్మవారు

సనత్‌నగర్: తొలి ఏకాదశి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈఓ సత్యనారాయణ నాయుడు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం (108 లీటర్ల పాలతో), లక్ష తులసీ దళములతో విశేష అర్చన, ఫలపుష్ప అలంకరణ జరిగాయి. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

హనుమాన్ దేవాలయంలో..

ఆషాఢమాసం రెండో ఆదివారం సందర్భంగా హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీపోచమ్మ అమ్మవారు శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో చేసిన అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈఓ సత్యనారాయణనాయుడు పర్యవేక్షణలో అర్చకులు విజయేంద్ర ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు.

మాలల అస్తిత్వాన్ని దెబ్బతీసే పార్టీలకు బుద్ధి చెబుతాం



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: కేవలం తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు మాలల జనాభాను తగ్గించి వర్గీకరణ పేరుతో మాలల అస్తిత్వాన్ని దెబ్బతీసే రాజకీయ పార్టీలను రాబోయే సంస్థాగత ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం మోండా డివిజన్‌లోని గాస్మండి తదితర ప్రాంతాల్లో మాల మహానాడు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాలలను అణగదొక్కి విద్య, ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం చేసిన రోస్టర్ విధానంలో కూడా కుట్రలు చేసిన రాజకీయ పార్టీలకు గుణపాఠం తప్పదన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఘనంగా తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు

రాంగోపాల్‌పేట్: తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ఆదివారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రెజిమెంటల్‌బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ఆలయ ఛైర్మన్ ' గౌరిశంకర్, సభ్యులు నందికంటి రవి, శ్రీనావాస్, వీరేష్, పరమేష్ తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టారు.

భక్తులతో కిటకిటలాడి మహంకాళి ఆలయం

ఒకవైపు ఆషాడమాసం, మరో వైపు వైకుంఠ ఏకాదశి వేడుకల సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం భక్తులతో నిండిపోయింది. ఆదివారం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది.



మహంకాళి దేవాలయంలో భక్తులు

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళులు అర్పిస్తున్న బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: జాతీయవాది, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ నేతలు ఆయనకు శనివారం ఘన నివాళులర్పించారు. బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ దేశానికి ఒకే రాజ్యాంగం, ఒకే జెండా ఉండాలని పోరాటం చేసి అరెస్టయ్యి జైలులోనే బలిదానం అయిన శ్యామాప్రసాద్ ముఖర్జీని యావత్ భారతావని ఎన్నటికీ మరువదన్నారు. దేశ సమగ్రత, సమైక్యత కోసమే బీజేపీ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి..

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని బన్సీలాల్‌పేట్, బీజేఆర్ నగర్, ఐడిహెచ్ కాలనీ, బోలక్‌పూర్ ప్రాంతాల్లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పూలమాలలేసి నివాళులర్పించారు.

చిలకలగూడ: స్వాతంత్ర్య సమరయోధుడు, దార్శనికుడు, అణగారినవర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలు సీతాఫల్‌మండి అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతాఫల్‌మండి ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు గరికపోగుల చంద్రశేఖర్ నేతృత్వంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బన్సీలాల్‌పేట్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉండే బాలాంజనేయ స్వామి దేవాలయం పక్కన ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడివుందన్న సమాచారం మేరకు గోపాలపురం పోలీసులు వెళ్లి గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి 35 నుంచి 40 సంవత్సరాల వయసుంటుందని, ఒంటిపై ఎరుపు రంగు చొక్కా, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని బహుశా అనారోగ్యంతో చనిపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు. మృతదేహాన్ని గుర్తింపు నిమిత్తం గాంధీ మార్చురీలో భద్రపరిచారు.